క్లుప్తంగా

విద్యార్థులకు క్రీడా దుస్తుల అందజేత



క్రీడా దుస్తులు అందజేస్తున్న మహేష్

బేస్తవారిపేట: మండలంలోని పూసలపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు బేస్తవారిపేటలోని రెడ్డినగర్‌కు చెందిన మా ఫ్యాషన్ దుకాణ యజమాని కె.మహేష్ గురువారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. రూ.5 వేల విలువైన క్రీడా దుస్తులను అందజేసిన దాతకు పాఠశాల హెచ్‌ఎం బొల్లా పద్మావతి, పీఈటీ మోడి రాజశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బూత్ కమిటీలను పటిష్టం చేయండి



పార్టీ రాష్ట్ర నాయకులతో రవిచంద్ర

మార్కాపురం: రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి క్షేత్ర స్థాయిలో వైఎస్సార్ సీపీ బూత్ కమిటీలను పటిష్టం చేయాలని వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల ఇన్‌చార్జి ఆలూరి సాంబశివారెడ్డి, రాష్ట్ర పోలింగ్ బూత్ వింగ్ అధ్యక్షుడు కె.సుధాకర్‌రెడ్డి సూచించారని ఆ విభాగం కార్యదర్శి పత్తి రవిచంద్ర తెలిపారు. గురువారం తాడేపల్లిలో ఆయన పార్టీ నేతలను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ నేతల ఆదేశం మేరకు కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.

ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేయాలి

మార్కాపురం టౌన్: అధికారంలోకి రాగానే ఉద్యోగులకు ఐఆర్ ప్రకటిస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మొహిద్దీన్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అధికారం చేపట్టి 15 నెలలవుతున్నా ఐఆర్ ప్రకటించకపోగా 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించకపోవడం ఉద్యోగులను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత పెండింగ్‌లో పెట్టిన డీఏలను ఉద్యోగులకు చెల్లించాలని సూచించారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న సమయంలో రెండేళ్లపాటు కరోనా ఉన్నప్పటికీ నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉద్యోగులకు ఇబ్బంది కలగకుండా చూశారన్నారు. కూటమి సర్కారు ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలుచేయకపోతే వారు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఉద్యోగులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని పేర్కొన్నారు.

రెండు బస్సులు సీజ్



సీజ్ చేసిన బస్సును చూపుతున్న ఎంవీఐ మాధవరావు

మార్కాపురం: సరైన పత్రాలు లేకుండా, ట్యాక్స్ చెల్లించకుండా తిప్పుతున్న రెండు బస్సులను గురువారం సీజ్ చేసినట్లు మార్కాపురం మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ మాధవరావు తెలిపారు. ఒక బస్సుపై 31,590 రూపాయలు, మరో బస్సుపై 2,88,330 రూపాయల రోడ్ ట్యాక్స్ పెండింగ్ ఉందని ఎంవీఐ వివరించారు. వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రిటైర్డ్ హెచ్‌ఎం మృతి



కేశవులు(ఫైల్)

కంభం: షెడ్యూల్డ్ కులాల పరిరక్షణ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు కాటమాల చెన్న కేశవరావు తండ్రి రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు కాటమాల కేశవులు(86) గురువారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం మృతి చెందగా, పలువురు ఉపాధ్యాయులు, ప్రజా సంఘాల నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.



బేస్తవారిపేట : సలకలవీడు బస్టాండ్‌లో మెయిన్‌రోడ్డు దుస్థితి



బేస్తవారిపేట : గలిజేరుగుళ్లలో ఇస్లాంపేటకు వెళ్లే రోడ్డు



అర్ధవీడు : పెద్దకందుకూరులో మురుగుమయంగా మెయిన్‌రోడ్డు

ఊళ్లు గబ్బు.. పాలనకు జబ్బు!



కొనకనమిట్ల : పాతపాడులో బురదగా మారిన దారి

వందలాది మంది జనాలు వైరల్ జ్వరాల బారిన పడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఇటీవల రాచర్లలోని గురుకుల పాఠశాలలో ఓ బాలిక వైరల్ జ్వరంతో మృతి చెందింది. జ్వర పీడితులు మార్కాపురం జీజీహెచ్, గిద్దలూరు ఏరియా వైద్యశాల, కంభం సీహెచ్‌సీతోపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గ్రామాల్లోని హెల్త్ సెంటర్లకు క్యూకడుతున్నారు. పారిశుధ్య లోపం కారణంగా దోమలు దండయాత్ర చేస్తున్నాయి. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యాన్ని మెరుగుపర్చాల్సిన ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో పరిస్థితులను గాలికొదిలేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- గ్రామాల్లో పారిశుధ్యం పరిస్థితి దారుణం
- డ్రెయినేజీలు, పంట కాల్వల్లో పేరుకుపోయిన మురుగు
- విజృంభిస్తున్న దోమలు.. జనాలకు జ్వరాలు
- రోడ్ల వెంట, గృహాల మధ్య ఖాళీ స్థలాల్లో పందుల స్వైర విహారం
- పాఠశాలలు, హాస్టళ్ల పరిసరాల్లో కానరాని శుభ్రత
- పంచాయతీల్లో పూర్తిగా పడకేసిన పాలన

సాక్షి నెట్‌వర్క్:

పరిశుభ్రత పాటించాలని తరచూ నిర్వహించే సమావేశాల్లో అధికారులు వల్లెవేయడమే కానీ క్షేత్ర స్థాయిలో పరిస్థితులు ఎలా ఉన్నాయో పట్టించుకోవడం లేదని పల్లెవాసులతోపాటు పట్టణ ప్రాంత ప్రజలు విమర్శిస్తున్నారు. గ్రామాల్లో అంతర్గత రహదారులపై బురద, మురుగు పేరుకుపోవడంతో దోమలు విజృంభిస్తుండటమే అందుకు కారణం. ఒక్క మార్కాపురం జిల్లా వైద్యశాలలో గత 20 రోజులుగా 195 మంది వరకు జ్వర పీడితులు ఇన్‌పేషెంట్లు చేరడం పారిశుధ్య పరిస్థితికి అద్దం పడుతోంది. ఇక ప్రైవేట్ ఆస్పత్రులు, ఆర్‌ఎంపీ వైద్యులను ఆశ్రయిస్తున్న జ్వర పీడితుల సంఖ్య భారీ స్థాయిలో ఉంది. రాచర్లలోని గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న అర్ధవీడు మండలం వెలగలపాయకు చెందిన ఓ బాలిక ఐదు రోజుల క్రితం తీవ్ర జ్వరంతో కంభం ప్రభుత్వ వైద్యశాలలో మృతి చెందిన విషయం తెలిసిందే. గిద్దలూరు నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, ప్రైవేట్ స్కూళ్ల పరిసరాలు అధ్వానంగా ఉన్నా పాలకులు పట్టించుకోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మురుగుతో తంటాలు.. బురద రోడ్లపై అవస్థలు

☛ కంభం పట్టణంలోని ప్రధాన వీధుల గుండా వెళ్తున్న ఇరిగేషన్ కాలువలో వ్యర్థాలు పేరుకుపోవడంతో దోమల బెడద ఎక్కువైంది. రోడ్ల పక్కన, ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో చెత్త తొలగించకపోవడంతో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దుర్వాసన భరించలేకపోతున్నామని కంభంలోని పలు వీధుల్లో ప్రజలు వాపోతున్నారు.

☛ బేస్తవారిపేట మండలంలోని గలిజేరుగుళ్ల, సలకలవీడు, అర్ధవీడు మండలంలోని పెద్ద కందుకూరు గ్రామాల్లో మెయిన్ రోడ్లు, అంతర్గత రహదారులు మురుగుకూపాలుగా మారాయి. కచ్చా డ్రెయిన్లు కూడా లేకపోవడంతో వర్షం నీరు ఎక్కడికక్కడే నిల్వ చేరి పాచి పట్టి దోమలు విజృంభిస్తున్నాయి. బురదమయంగా మారిన రహదారులపై రాకపోకలు సాగించలేక వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు.

☛ కొనకనమిట్ల మండలంలోని గొట్లగట్టు పంచాయతీ కార్యాలయం వద్ద, మెయిన్ రోడ్ స్పీడ్ బ్రేకర్ వద్ద, తుంగనగర్ బీసీ కాలనీలో వర్షం నీరు బయటకు వెళ్లే మార్గం లేక రోజులతరబడి నీరు నిల్వ ఉంటున్నాయి. పెదారికట్ల, గొట్లగట్టు, పాతపాడు, గనివానిపాడు, కొనకనమిట్ల, నాగంపల్లి తదితర గ్రామాల్లో బురద రోడ్లపై జనం నిత్యం అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి అంతర్గత రహదారులను అభివృద్ధి చేయాలని, దోమల నివారణకు బ్లీచింగ్ పౌడర్ చల్లి, ఫాగింగ్ చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. పంచాయతీ అధికారులు, వైద్యారోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేసి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కంభం : తర్లుపాడు రోడ్డులో పందుల స్వైరవిహారం



కంభం : బీసీ హాస్టల్ వెనుక నిలిచిన మురుగు



కొనకనమిట్ల : గొట్లగట్టు బీఎస్‌ఎన్‌ఎల్ టవర్ వెనుక వీధి దుస్థితి



కొనకనమిట్ల : సలనూతలలో అంకాలమ్మ అరుగు వద్ద సీసీ రోడ్డుపై పేరుకున్న బురద



కంభంలో గృహాల మధ్య ఇరిగేషన్ కాలువ దుస్థితి

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



రాచర్లలో ఆర్‌ఐకి వినతి పత్రం ఇస్తున్న కార్యకర్తలు



గిద్దలూరులో తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

గిద్దలూరు రూరల్: అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం నుంచి రెవెన్యూ కార్యాలయం వరకు నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తల సంఘ నాయకులు పి.స్వర్ణకుమారి, మున్నా మాట్లాడుతూ.. కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్లను రద్దు చేయాలని, ఐసీడీఎస్ బలోపేతానికి బడ్జెట్‌లో నిధులు పెంచాలని, అంగన్‌వాడీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, గత సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలపై పోరాటంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ఐక్యమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు రమణమ్మ, రత్నం, సారమ్మ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాచర్ల: మండల కేంద్రమైన రాచర్లలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ సిబ్బంది నిరసన తెలిపారు. యూనియన్ నాయకురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ.. కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌ను రద్దు చేసి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. గతంలో 42 రోజుల సమ్మె కాలం నాటి ఒప్పందాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్‌ఐ హర్ష గౌడ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

సెప్టెంబర్ 15లోగా ఈ-క్రాప్ పూర్తి చేయాలి

- వ్యవసాయశాఖ జేడీ శ్రీనివాసరావు



చింతగుంట్లలో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న జేడీ శ్రీనివాసరావు

మార్కాపురం టౌన్/గిద్దలూరు రూరల్: రైతులు సాగు చేసిన పంటల వివరాలు ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని వ్యవసాయశాఖ జేడీ శ్రీనివాసరావు సూచించారు. గురువారం ఆయన మార్కాపురంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో డివిజన్ పరిధిలోని వ్యవసాయాధికారులతో సమావేశమయ్యారు. అలాగే గిద్దలూరు ఎంపీడీఓ కార్యాలయంలో రాచర్ల, కొమరోలు, బేస్తవారిపేట, గిద్దలూరు మండలాల వ్యవసాయాధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో పొలాల వద్దకు వెళ్లి ఈ-క్రాప్ వివరాలు నమోదు చేయాలని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 15వ తేదీలోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నగదు జమ కాకపోతే వచ్చే విడతలో అందిస్తారని చెప్పారు. అనంతరం చింతగుంట్ల గ్రామంలో వ్యవసాయశాఖ ఏడీ బాలాజీ నాయక్, ఏఓలతో కలిసి ఈ క్రాప్ నమోదును పరిశీలించారు. గిద్దలూరులో ఏఓలతో మాట్లాడుతూ.. యంత్రపరికరాల సర్వే, పంట బీమా, ఎరువుల నిల్వ అమ్మకాల పై ప్రతి రైతు సేవా కేంద్రం సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రైవేట్ ఎరువుల దుకాణాలపై నిఘా ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం కె.ఎస్.పల్లెలో ఆముదాల పంటను ఏడీఏ కె.రాజేశ్వరి, ఏఓలతో కలిసి జేడీ పరిశీలించారు.

సాయి బాబా మందిరంలో పూజలు

అర్ధవీడు: స్థానిక సాయి బాబా మందిరంలో గురువారం భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. సుప్రబాత సేవ అనంతరం పూజారులు బాబా మూలవిగ్రహమూర్తిని పూలమాలలతో అలంకరించి, దూప దీప నైవేద్యాలు సమర్పించారు. కాకడ హారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రతి గురువారం బాబా మందిరంలో అన్న సంతర్ప చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

శాంతి భద్రతల బాధ్యత నిర్వాహకులదే..



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

పొదిలి: వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేసుకునే మండపాల వద్ద శాంతి భద్రతలకు విఘాతం కలిగితే నిర్వాహకులే బాధ్యత వహించాలని సీఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం రాత్రి స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఎస్సై వేమనతో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదని చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని తెలిపారు. విద్యుత్ శాఖ అనుమతి తీసుకోవడంతోపాటు సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఊరేగింపు, నిమజ్జన సమయాలను పోలీస్ శాఖకు ముందుగా తెలియజేయాలన్నారు. శాంతియుతంగా ఉత్సవాలు నిర్వహించుకోవాలని కోరారు.

మండపాల వద్ద గొడవలు చేస్తే సహించం

కొమరోలు: వినాయక మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్సై నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విగ్రహం ఏర్పాటు చేసే ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండపాల వద్ద గొడవలు చేస్తే సహించేది లేదని, వివాదాలకు ఉద్దేశపూర్వకంగా రాజకీయ రంగు పులిమి శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.

చెన్నకేశవస్వామి సన్నిధిలో జిల్లా అదనపు న్యాయమూర్తి పూజలు



పూజలు చేస్తున్న జడ్జి లలిత

మార్కాపురం టౌన్: మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో గురువారం ఒంగోలు రెండో అదనపు జిల్లా జడ్జి పి.లలిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు ఆలయ మర్యాదలతో అధికారులు స్వాగతం పలకగా, అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందించి, స్వామివారి శేష వస్త్రాలు బహూకరించారు. న్యాయమూర్తి వెంట ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

వానొస్తే బురదమయం.. విష సర్పాలతో భయం

కంభం: మండలంలోని సూరేపల్లి గ్రామంలో ఒకే ప్రాంగణంలో ఉన్న ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రానికి ప్రహరీ లేకపోవడం, చుట్టూ చిల్ల చెట్లు పెరగడంతో విద్యార్థులు భయపడూతూ పాఠశాలకు వెళ్లాల్సి వస్తోంది. ఓ తరగతి గది వానకు ఉరుస్తుండటంతో విద్యార్థులను ఒకే గదిలో కూర్చోపెట్టి పాఠాలు బోధిస్తున్నారు. వర్షాలు పడితే పరిసరాలు చిత్తడిగా మారిపోయి విద్యార్థులు లోపలికి వెళ్లడానికి నానాతంటాలు పడుతున్నారు. చిల్లచెట్లలో పాములు, ఇతర విషకీటకాలు సంచరిస్తుండటం, ప్రాంగణంలో పశువులు తిరుగుతుండటంతో విద్యార్థులకు భద్రత కరువైంది. ప్రహరీ నిర్మించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ పెరిగిన చిల్లచెట్లు

నిబంధనలు పాటించని మద్యం దుకాణాలపై చర్యలు

- ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆయేషా బేగం



మాట్లాడుతున్న ఆయేషా బేగం

మార్కాపురం: మద్యం అధిక ధరలకు విక్రయించినా, నిబంధనలకు వ్యతిరేకంగా షాపులు నిర్వహించినా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆయేషా బేగం హెచ్చరించారు. గురువారం మార్కాపురం ఎక్సైజ్ కార్యాలయంలో ఆమె షాపుల ఓనర్లు, ఆశావహులతో సమావేశం నిర్వహించారు. మార్కాపురం మున్సిపాలిటీలో ఏర్పాటు చేయనున్న 7 నూతన బార్లలో 5 ఓపెన్ కేటగిరీ, 2 గీత కులాలకు కేటాయించినట్లు వివరించారు. సమావేశంలో ఎక్సైజ్ సీఐ వెంకటరెడ్డి పాల్గొన్నారు.